క్లుప్తంగా

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి



విలేకరికి హెల్మెట్ అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

చెన్నేకొత్తపల్లి: ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రామగిరి సీఐ శ్రీధర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలో పని చేస్తున్న విలేకరులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విలేకరులు హెల్మెట్ ధరించి ఇతరులకు ఆదర్శంగా ఉండాలన్నారు. ప్రమాదాలు జరిగిన ప్రాంతాలకు త్వరగా చేరుకునేందుకు వీలుగా ఒక ద్విచక్ర వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రథమ చికిత్సకు అవసరమైన మందులు సమకూర్చారు. ర్యక్రమంలో ఎస్‌ఐ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ పేమెంట్స్ సద్వినియోగం చేసుకోండి

పుట్టపర్తి టౌన్: తపాలా శాఖ ప్రవేశపెట్టిన ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ) సేవలు సద్వినియోగం చేసుకోవాలని పెనుకొండ ఇన్‌స్పెక్టర్ విమల్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జాతీయ, ప్రాంతీయ బ్యాంక్‌లతో సమానంగా ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్‌లో అర్హులైన వారికి ఆర్థిక సాధికారిత, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. పెనుకొండ సబ్ డివిజన్‌లో ఉన్న పోస్టాఫీసులతో పాటు పట్టణ, గ్రామీణ తపాలా శాఖ ద్వారా ప్రత్యేక శిబిరాలు ఈ నెల 15 నుంచి ప్రారంభించినట్లు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న ఖాతాలు కూడా పునరుద్ధరిస్తామన్నారు. ఆధార్ లింకేజ్ కూడా చేసుకోవచ్చున్నారు.

ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చర్యలు



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ స్వర్ణలత

సాక్షి ఎఫెక్ట్..

బత్తలపల్లి: సంజీవపురం సచివాలయం ముందు ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ స్వర్ణలత పేర్కొన్నారు. ఆదివారం 'ప్రభుత్వ స్థలంపై కూటమి నేతల కన్ను' శీర్షికన సాక్షి పత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన తహసీల్దార్ సోమవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. ఇక్కడ ప్రభుత్వ భూమి ఎంత ఉందో సర్వే చేయాలని సర్వేయర్‌ను ఆదేశించారు. ఇందులో ఎవ్వరికీ పట్టాలు ఇవ్వబోమన్నారు. పట్టాలు ఇవ్వాలనుకుంటే మరో చోట ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. గ్రామంలో రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని గ్రామస్తులు కోరుతున్నారన్నారు. వాటిని కూడా పరిశీలించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతానికి ప్రభుత్వ భూమిలో ఎవ్వరూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టకూడదని హెచ్చరించారు. తహసీల్దార్ వెంట మండల సర్వేయర్ జోసఫ్, వీఆర్‌ఓ ముత్యాలప్ప, విలేజ్ సర్వేయర్ ప్రవీణ్, విజయ్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా జీవించాలి



మాట్లాడుతున్న డీఎస్పీ శివనారాయణస్వామి

తనకల్లు: ప్రజలు ప్రశాంతగా జీవించాలని కదిరి డీఎస్పీ శివనారాయణస్వామి సూచించారు. ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామం కొక్కంటిలో సోమవారం గ్రామస్తులతో ఆయన సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో గొడవలు పడి శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. సైబర్ క్రైం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్డు భద్రత నియామాలను ప్రతి ఒక్కరూ పాటించాలని పేర్కొన్నారు. అనంతరం డయల్ 100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెట్టండి సార్!

ఎన్పీకుంట: తమకు జీతాల బిల్లులు పెట్టాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. 2006 నుంచి పనిచేస్తున్న తమ స్థానాల్లో ఇటీవల మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా కొత్తవారితో పనులు చేయిస్తున్నారని తెలిపారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో తమను విధులకు హాజరు అయ్యేలా జడ్జిమెంట్, ఆర్డరు కాపీ వచ్చిందని తెలిపారు. అయితే ఇప్పటికీ తమకు వర్క్‌ఫైల్ ఇవ్వలేదని, జీతాలు పెట్టలేదని వాపోయారు. తమ గ్రామ పంచాయితీలలో విధులు కల్పించి, జీతాలు మంజూరు చేయాలని కోరారు.



వేణుగోపాల స్వామి రథోత్సవం సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న ఆర్.జె.రత్నాకర్



రథానికి మొక్కుతున్న భక్తులు



గోపిక, కృష్ణుల వేషధారణలో సాయి విద్యానికేతన్ విద్యార్థులు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కళాకారులు

నేత్రపర్వం.. రథోత్సవం

పుట్టపర్తిలో వేణుగోపాలస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. అశేష భక్త జన సందోహం నడుమ రథం ముందుకు కదిలింది. సాయి వేణుగోపాలుని నామస్మరణతో పుర వీధులు ప్రతిధ్వనించాయి. భక్తులు బారులు దీరి స్వామివారిని దర్శించుకుని తరించారు. రథోత్సవం సందర్భంగా కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– పుట్టపర్తి రూరల్



బృందావనమాలి పాటకు కోలాటం



ఆకట్టుకున్న కీలుగుర్రాల ప్రదర్శన

బాలికలు అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థినులకు బహుమతులు అందిస్తున్న సీడీపీఓ లక్ష్మి

ధర్మవరం అర్బన్: జరిగే లైంగిక దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మి సూచించారు. పట్టణంలోని కొత్తపేట మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ పీడీ సుధా వరలక్ష్మి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ సమితి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడీపీఓ లక్ష్మి మాట్లాడుతూ నేటి సమాజంలో ఏదో ఒక చోట బాలలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బాలికలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పిల్లల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిస్తే తల్లిదండ్రులకు, పోలీసులకు, 1098కు తెలియజేయాలన్నారు. అనంతరం విద్యార్థినులు ప్రణతి, లాస్య మాట్లాడుతూ పిల్లలు మంచి ప్రవర్తన కలిగి ఉంటే ఏ తల్లిదండ్రులూ బాల్య వివాహం చేయడానికి పూనుకోరని పేర్కొన్నారు. మన ప్రవర్తనే మనల్ని కాపాడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు సీడీపీఓ బహుమతులు అందించారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ సమితి రక్షణ అధికారి నాగలక్ష్మి, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, సూపర్‌వైజర్లు అరుణ, మణిమాల, లతా కిరణ్, పాఠశాల హెచ్‌ఎం మేరీవరకుమారి, ఉపాధ్యాయులు రమేష్, శారద, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ శంభో శంకర





కదిరి ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు, దీపాలు వెలిగిస్తున్న మహిళలు

తాడిమర్రి/ కదిరిటౌన్: కార్తీక మాసం మూడో సోమవారం శివాలయాలు భక్తజనంతో పోటెత్తాయి. తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి శ్రీకాటికోటేశ్వర క్షేత్రం, పురాతన శివాలయం, భైరవేశ్వరస్వామి ఆలయం, తూర్పు చెరువు కట్ట సమీపంలోని శివాలయం, చిల్లకొండయ్యపల్లి, కునుకుంట్ల, నిడిగల్లు గ్రామాల్లోని శివాలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. కాటికోటేశ్వరంలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి ప్రదక్షిణలు చేసి స్వామికి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కదిరి పట్టణంలోని శివాలయం, సైదాపురం శివాలయం, మరకత మహాలక్ష్మి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి అనుబంధ ఆలయమైన ఉమామహేశ్వర ఆలయంలో శివానామాస్మరణ మార్మోగింది. స్వామివారు అర్ధనారీశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

గుమ్మనాథేశ్వరుడికి ప్రత్యేక పూజలు

చెన్నేకొత్తపల్లి: కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని సోమవారం మండల పరిధిలోని పలు శివాలయాల్లో పూజలు నిర్వహించారు. కనుముక్కలలోని గుమ్మనాథేశ్వర స్వామి మూలవిరాట్‌ను అర్చకుడు ప్రసన్నకుమార్ స్వామి పూలతో అలంకరించారు. పంచామృతాభిషేకాలతో అభిషేకాలు చేపట్టారు.

శివునికి కార్తీక పూజలు

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలోని హరిహర గణేశ దేవాలయంలో సోమవారం పండితులు రఘునాథశాస్త్రి ఆధ్వర్యంలో కార్తీక మాస పూజలు చేశారు. స్వామి వారు భవానీ శంకర్ అవతారంలో దర్శనమిచ్చారు.

యాంటీబయాటిక్ మోతాదు మించితే దుష్ప్రభావమే



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీటీ వైద్య సిబ్బంది

బత్తలపల్లి: యాంటీబయాటిక్ ఎక్కువ మోతాదులో తీసుకోవడం వల్ల ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం బత్తలపల్లిలో ఆర్డీటీ ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అవగాహనలో భాగంగా ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. వైద్యులు మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ యాంటీబయాటిక్ ఆరోగ్యంపై చూపించే ప్రభావం గురించి ప్రమాదకరమైన రోజులు రాబోతున్నాయని తెలియజేసేందుకు వారం రోజులు పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాంటీబయాటిక్ అంటే ప్రజలు వైద్యుల పర్యవేక్షణ లేకుండా వాడడం, సొంత వైద్యం చేసుకోవడం వంటివన్నారు. వీటికి ప్రజలు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీటి వైద్యులు రఘు, హరి, శర్మ, రిషికేష్‌రెడ్డితో పాటు పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

ప్యాదిండిలో కంటి వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: ప్యాదిండి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు ఆడుకునేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కంటి సంబంధిత సమస్యలు వచ్చినపుడు దగ్గరలోని ప్రభుత్వాసుపత్రిలో వైద్యుడిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. నాటు వైద్యం చేయించుకోవద్దని సూచించారు. అలా చేయించుకుంటే కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది ప్రియాంక, సీహెచ్‌ఓ మాధవి, తదితరులు పాల్గొన్నారు.

కళాశాల యాజమాన్యంపై చర్యలకు డిమాండ్



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కదిరి అర్బన్: తోటివిద్యార్థులో గాయపడిన ప్రేమ్‌సాయిని సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం వహించి, విద్యార్థి మృతికి కారణమైన పుట్టపర్తిలోని సంస్కృతి కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. సోమవారం కళాశాల వద్ద ధర్నా నిర్వహించాయి. అనంతరం ఎస్పీ రత్నకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీ, పీఎస్‌యూ, ఏఐఎస్‌ఓ, ఎస్‌ఎస్‌యూఐ, ఏపీఎస్‌ఎఫ్ నాయకులు నరసింహ, నరేంద్ర, నిరంజన్, గణేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలి

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు లింగన్న, రమేష్ కోరారు. సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. రామగిరి మండలంలోని చెర్లోపల్లి, మంగాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ టీచర్లను పలువురు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామగిరి మండలం చెర్లోపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి తాళం వేసి, లక్ష్మీనరసమ్మ విధులకు హాజరుకాకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. మంగాపురం గ్రామానికి చెందిన ఇంద్రజ విధులకు హాజరు కాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. సీడీపీఓ కవితాదేవికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అనంతరం సీడీపీఓ మాట్లాడుతూ.. ఇబ్బందులు పడుతున్న వారు ఫిర్యాదు చేస్తే పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయిస్తామని తెలిపారు.

కనకదాస మార్గంలో పయనిద్దాం



చిల్లవారిపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్



బుక్కపట్నంలో కనకదాస విగ్రహానికి పూజలు నిర్వహిస్తున్న నాయకులు



ధర్మవరంలో కురుబల బైక్ ర్యాలీ

తాడిమర్రి: కురుబలు భక్త కనకదాస మార్గంలో పయనించి సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా అభివృద్ధి చెందాలని హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ పిలుపునిచ్చారు. చిల్లకొండయ్యపల్లిలో కురుబలు సోమవారం నిర్వహించిన భక్త కనకదాస జయంతి ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 500 ఏళ్ల క్రితం కనకదాస దేశాటన చేస్తూ తన మధుర గానంతో మానవాళిని జాగృతపరిచారన్నారు. కులవివక్ష అధికంగా ఉన్న ఆ రోజుల్లో మానవజాతి అంతా సమానమేనని గళమెత్తిన మహనీయుడు అని కొనియాడారు. కార్యక్రమంలో కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు దుప్పటి ఈశ్వరయ్య, మాజీ అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కాటమయ్య, పుట్టపర్తి జిల్లా నాయకులు సామకోటి ఆది, రామాపురం సర్పంచ్ పుల్లయ్య, మాజీ ఎంపీటీసీ అశ్వత్థ, సాంబ, అశ్వత్థ పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి కనకదాస

ధర్మవరం అర్బన్: కురుల ఆరాధ్య దైవం భక్త కనకదాస మహోన్నత వ్యక్తి అని నాయకులు పేర్కొన్నారు. ధర్మవరంలో భక్త కనకదాస 537వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. కురుబ కళ్యాణ మండపం అధ్యక్షుడు మాలగుండ్ల మల్లికార్జున, ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ కమతం కాటమయ్య ఆధ్వర్యంలో ఎర్రగుంట సర్కిల్ కురుబ కళ్యాణ మండపం వద్ద నుంచి కురుబ యువకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాజ్యోతి సర్కిల్‌లో ఉన్న కనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కురుబ కళ్యాణ మండపం కార్యదర్శి కప్పల బలరాముడు, కోశాధికారి బండి ఉజ్జినప్ప, ఉపాధ్యక్షులు కోటి వెంకటేష్, గవ్వల నారాయణస్వామి, గిరక నారాయణస్వామి, బత్తలపల్లి ఉప సర్పంచ్ కోటి నరేష్, కోటి సురేష్, కౌన్సిలర్ కత్తె పెద్దన్న, బీసీ సంఘం పట్టణ అధ్యక్షుడు బండి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: బత్తలపల్లిలోని నాలుగురోడ్ల కూడలిలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు కోటి సురేష్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు కోటి నరేష్‌కుమార్, కురుబ కులస్తులు, సంఘం నాయకులు భక్త కనకదాస జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో బిల్లే సూరి, బిల్లే వెంకటనారాయణ, బండి నాగభూషణ, కొంకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతిని జాగృతం చేసిన ఆదర్శమూర్తి

పుట్టపర్తి: జాతిని జాగృతం చేసిన గొప్ప ఆదర్శ మూర్తి భక్త కనకదాస అని ఉమ్మడి జిల్లా పీఆర్ ఇంజినీర్ల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, విశ్రాంత డీఈఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ, కురుబ సంఘం నేతలు కొనియాడారు. సోమవారం బుక్కపట్నం ఆస్పత్రి వద్ద ఉన్న కనకదాస విగ్రహానికి వారు పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం కనకదాస ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, చిట్రా నారాయణస్వామి, చిన్నా, రామలింగారెడ్డి, పతంజలి, ఈశ్వర్ పాల్గొన్నారు.

వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు



కదిరిలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కదిరి అర్బన్/ బత్తలపల్లి: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం కదిరిలోని రాణీపేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి త్వరలో బహుమతులు ప్రధానం చేయనున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి క్రిష్ణకిషోర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జనార్దన్, ఉపాధ్యాయులు జానకి, విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తలపల్లిలోని బాలికల ఉన్నతపాఠశాల, శ్రీజ్యోతి హైస్కూలులో సోమవారం విద్యార్థులకు గ్రంథాలయ ప్రాముఖ్యతపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను గ్రంథాలయ అధికారి రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

చెన్నేకొత్తపల్లి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంతో పాటు మేడాపురం గ్రామంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేస్తామని చెన్నేకొత్తపల్లి గ్రంథాలయ అధికారి జయరాం, మేడాపురం గ్రంథాలయ అధికారి చెన్నకేశవులు తెలిపారు.

రామగిరి: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటేష్, ప్రిన్సిపాల్ సర్వేశ్వరి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడిమర్రి: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో సోమవారం గ్రంథాలయ అధికారి డి.శీనానాయక్ విద్యార్థులకు చిత్ర లేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ప్రిన్సిపాల్ వాణిశ్రీ, ఉపాధ్యాయినులతో కలసి ఆయన విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయాలు–వాటి ఆవిశ్యకతపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు రోజా రమణి, సౌభాగ్య, ప్రతిభా భారతి తదితరులు పాల్గొన్నారు.

గాండ్లపెంట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయ అధికారి ఫరియా బాను సోమవారం క్విజ్, ఖోఖో, పరుగుపందెం, టెన్నికాయిట్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. పీడీ హరిప్రసాద్, ఉపాధ్యాయులు ముంతాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి పట్టాలు ఇవ్వండి



బత్తలపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పుట్టపర్తి అర్బన్/ తనకల్లు/ బత్తలపల్లి/ కదిరిటౌన్: అర్హులైన పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని సీపీఐ డిమాండ్ చేసింది. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆందోళన చేపట్టింది. సీపీఐ నాయకులు పుట్టపర్తి ఆర్డీఓ తనకల్లు, బత్తలపల్లి, కదిరి, తలుపుల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. బత్తలపల్లిలో సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, చేతివృత్తుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జింకా చలపతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, బత్తలపల్లి మండల కార్యదర్శి వెంకటేష్, ధర్మవరం పట్టణ కార్యదర్శి రవి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, పుట్టపర్తిలో నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడారు. అర్హులైన నిరుపేదలకు పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. పక్కాగృహం నిర్మాణానికి రూ.5లక్షల చొప్పున మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దశలవారీగా ఉద్యమాలు చేస్తామని తనకల్లు మండల నాయకులు చౌడప్పయాదవ్, రవి, రెడ్డెప్ప, శంకర, ఆంజినేయులు, బాలకృష్ణ, శ్రీనివాసులు, గంగన్న, సచ్చురామయ్య, లక్ష్మీదేవి హెచ్చరించారు. కదిరిలో సీపీఐ నాయకులతో పాటు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మధునాయక్, నాయకులు ఎస్.ఆలియా, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల వద్ద ధర్నా

చెన్నేకొత్తపల్లి/ తలుపుల : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం చెన్నేకొత్తపల్లి న్యామద్దెల, తలుపుల మండలం కుర్లి సచివాలయాల వద్ద ధర్నా చేశారు.

జాతీయస్థాయి పోటీలకు కదిరి విద్యార్థిని



శైలజ

కదిరి అర్బన్: పట్టణంలోని హరీష్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న శైలజ ఛత్తీస్‌గఢ్‌లోని రాయపూర్‌లో ఈ నెల 24 నుంచి నిర్వహించే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైంది. గుంటూరు జిల్లా తెనాలిలో గత అక్టోబర్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో శైలజ ఉమ్మడి అనంతపురం జిల్లా తరఫున ఆడి ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయి జట్టులో చోటు సంపాదించుకుంది. తమ పాఠశాల విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనందుకు సంతోషంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ కిరణ్, పీఈటీ ప్రసన్నకుమార్, ఖాదర్‌వలి సంతోషం వ్యక్తం చేశారు.

పాఠశాలల పనివేళల పెంపు రద్దు చేయాలి

ఎన్పీకుంట: ప్రభుత్వం ప్రయోగాత్మకంగా చేపట్టిన పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయాన్ని పునఃసమీక్షించి ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్పీకుంటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలలు, హైస్కూల్‌ప్లస్ పాఠశాలల్లో పనివేళలను సాయంత్రం 5 గంటల వరకు పొడిగించాలనే నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. రవాణా సౌకర్యాలు సరిగాలేని మారుమూల ప్రాంతాల్లో ఈ కొత్త పనివేళల అమలు సాధ్యపడదని వివరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు రామాంజులుయాదవ్, మురళి, రహీం, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కనగానపల్లి: పురుగు మందులు వాడకం లేని ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని జెడ్పీఎన్ఎఫ్ క్లస్టర్ ఇన్‌చార్జ్ పెద్దిరెడ్డి తెలిపారు. మండలంలోని దాదులూరు, ముక్తాపురం, మామిళ్లపల్లి గ్రామాల్లో సోమవారం జెడ్పీఎన్ఎఫ్ సిబ్బంది పర్యటించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా దాదులూరులో ఐసీఆర్‌పీ కేశవయ్య తన పొలంలో ఏటీఎం పద్దతిలో 16 రకాల విత్తనాలతో చేస్తున్న సాగు విధానాన్ని రైతులకు వివరించారు. ముక్తాపురంలో జీవామృతం తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం మామిళ్లపల్లిలో ప్రకృతి వ్యవసాయం కింద సాగు చేసిన మిశ్రమ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వీఏఏ రుక్మిణి, ప్రకృతి వ్యవసాయ కో–ఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాలల హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన

పుట్టపర్తి: బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం బాలల పరిరక్షణ, చట్టాలపై బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కౌసల్యసాయి అవగాహన కల్పించారు. హెచ్‌ఎం జగదీశ్వర్, పీడీ నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పెషల్ ఆధార్ క్యాంపులు

పుట్టపర్తి టౌన్: పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నుంచి మూడు రోజులపాటు స్పెషల్ ఆధార్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ప్రహల్లాద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఆధార్ నమోదు, ఐదేళ్లు దాటిన పిల్లలు, ఆధార్ కార్డు పొంది పదేళ్లు పూర్తయిన వారి బయోమెట్రిక్ అప్డేట్ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ సెంటర్‌లో అధికారులను నియమించాలి

ఎన్పీకుంట: మండలంలోని మూడు ఆధార్ కేంద్రాల్లో అధికారులను నియమించి విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ ప్రక్రియ ముందుకు సాగేలా చూడాలని ఎన్పీకుంట ఉపసర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి సోమవారం తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంపీడీఓ అంజినప్పను కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అపార్ ఐడీల ప్రక్రియ జరుగుతోందన్నారు. పేర్లల్లో తప్పిదాలు ఉన్న విద్యార్థులు ఆధార్ అప్‌డేషన్ కోసం కేంద్రాలకు వస్తున్నారన్నారు. అయితే అధికారులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

అధికారుల గైర్హాజరు

ఎన్పీకుంట: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. తహసీల్దార్ నరేంద్రకుమార్, ఎంఈఓ గోపాల్‌నాయక్, ఈఓపీఆర్డీ మాధవరెడ్డి, తిమ్మమ్మమర్రిమాను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మౌలాబీ మాత్రమే హాజరయ్యారు.